క్లుప్తంగా

రూ.26వేల వేతనం ఇవ్వాలి

అశ్వారావుపేటరూరల్: మధ్యాహ్న భోజన పథకానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి, అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్న కార్మికులకు కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం స్థానిక ఎమ్మార్సీ, మండలంలోని నారాయణపురం, గుమ్మడవల్లి, వినాయకపురం అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్లకు ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసులు అందించారు. ఈ కార్యక్రమంలో నన్నీ, చిలకమ్మ, యామిని, సీత, కృష్ణవేణి, సామ్రాజ్యం, లక్ష్మి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్ష పదవికి బుధవారం ఎన్నికలు నిర్వహించారు.ఈ ఎన్నికలలో మండల అధ్యక్షుడిగా మడకం మహేంద్రనాథ్, కార్యదర్శిగా దరిశెట్టి రవి, కోశాధికారిగా శ్యామల రవి వర్మలను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు మహేంద్రనాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గౌరవాధ్యక్షులు ప్రకాష్, పంపన రామకృష్ణ, కిసరి సుధాకర్ రెడ్డి,అనిల్, వైస్ ప్రెసిడెంట్ మూర్తి, వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ పూదోట విజయ్ కుమార్, మండల ఫోటోగ్రాఫర్స్ వాగె చిన్నబాబు, పవన్ కుమార్, పిలక నాగేశ్వరరావు రెడ్డి పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టండి

కరకగూడెం: మండలంలో గతేడాది భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను తక్షణమే మరమ్మతులు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న రహదారులను పరిశీలించి మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా రోడ్లు దారుణంగా దెబ్బతిని ప్రమాదాలకు నిలయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగితే తప్ప అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. ఇకనైనా రహదారులకు మరమ్మతులు చేయాలని కోరారు.

నాయకుల నివాళి

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో గుండె సోమయ్య ఇటీవల మరణించగా.. ఆయన దశదిన కర్మలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి సుధాకర్, ఏఐటీయుసి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మీనారాయణ, సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు లు హాజరై సోమయ్య చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఎస్‌కె.సర్వర్, రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, కార్యవర్గ సభ్యుడు కణితి సత్యనారాయణ, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రాయల బిక్షం, ఆధర్ల రాములు, సుధాకర్, ప్రసాద్, బీమ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ కుట్ర'

అశ్వాపురం: ప్రొఫెసర్ కోదండరాం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారానికి బీఆర్ఎస్ పార్టీ కుట్ర చేసి అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మొండికుంటలో ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దల సభలో కోదండరాం అడుగుపెడితే బీఆర్ఎస్‌పార్టీ అవినీతి, అక్రమాలు బహిర్గతమవుతాయని గ్రహించి బీఆర్ఎస్ నాయకత్వం కుట్రలు పన్నుతోందన్నారు. సమావేశంలో టీజేఎస్ మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుప్పట్లు వితరణ

ములకలపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు దుప్పట్లు వితరణగా అందజేశారు. మండలపరిధిలోని మొగరాలగుప్ప గ్రామానికి చెందిన 20 మంది నిరుపేద వృద్ధులకు క్లబ్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ జిల్లా దశరథ్ సహకారంతో క్లబ్ అధ్యక్షుడు రాయల కేథారేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాదరావు, ట్రెజరర్ ఎండి. రంజాన్, సభ్యుడు అనంతుల మహేశ్, గ్రామస్తులు కీసరి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహారం, దుస్తులు..

అశ్వాపురం: దానధర్మ ట్రస్ట్ చైర్మన్ గంటా రాధ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కుమ్మరిగూడెంలో వలస ఆదివాసీ గిరిజనులకు బుధవారం ఆహార పొట్లాలు, దుస్తులు పంపిణీ చేశారు. 50 కుటుంబాలకు దుస్తులు, 100 మందికి భోజనాలు అందజేశారు.

యాత్రలో దాడి తగదు

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ చేస్తున్న భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా కొంతమంది రాజకీయ దుండగులు కారుపై దాడికి పాల్పడటం తగదని కాంగ్రెస్ పార్టీ నాయకులు జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి అన్నారు. బుధవారం స్థానిక ఆయన నివాసంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. దాడి ఘటనపై తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సర్పంచ్ దాసరి నాగేంద్రరావు, బి.సురేష్, కె.శ్రీనివాసరావు, ఏ.రాంబాబు, బి.నాగబాబు, వి.రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు రహదారి కష్టాలు

- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని కళాశాల దారి
- రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్న స్థానికులు


అధ్వానంగా ఉన్న జూనియర్ కళాశాల రోడ్డు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారి కష్టాలు తీరేదెన్నడో నని విద్యార్థులు, అధ్యాపకులు ఆ ప్రాంతం మీదుగా లక్ష్మీకాలనీ, సాయినగర్ కాలనీ, దేవానగరం, దోశిళ్లపల్లి గ్రామాలకు వెళ్లే ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

చర్లలోని బస్టాండ్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గంలో సాయి బాబా టెంపుల్ వరకు ఉన్న సుమారు 600 మీటర్ల పొడవు ఉన్న రహదారి అధ్వానంగా ఉంది. ఈ రహదారికి సుమారు రెండు దశాబ్దాల కాలంగా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ రోడ్డుపై పెద్ద ఎత్తున గోతులు ఏర్పడి నడవడానికి కూడా కష్టంగా ఉంది. నిత్యం ఈ దారిలో ద్విచక్రవాహనాదారులు, సైక్లిస్టులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లా పరిషత్ పరిదిలో ఉన్న ఈ రహదారి మరమత్తులకి ఇటు పంచాయతీ నుంచి అటు ఆర్అండ్ నుంచి నిధులు కేటాయించకపోవడం అడ్డంకిగా మారనుండగా, ఈ దారి మరమత్తుకు జిల్లా పరిషత్తు నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో ఈ రహదారి మరింత అధ్వానంగా తయారవుతోంది.

పలు కార్యాలయాలు ఈ దారి గుండానే..

మండల పరిషత్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాయిబాబా మందిరం, వ్యవసాయశాఖ కార్యాలయం, విద్యుత్ శాఖ కార్యాలయం, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్యాలయం, ఇందిరాక్రాంతిపథం కార్యాలయం, మార్కెట్ కమిటీ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ఈ దారి గుండానే వెళ్లాల్సి ఉంటుంది. వివిధ అవసరాల కోసం ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలతో పాటు దేవానగరం, దోశిళ్లపల్లి, తాలిపేరు ప్రాజెక్టు, తిప్పాపురం, ఉయ్యాలమడుగు, చెలిమెల, చెన్నాపురం, ఎర్రంపాడు తదితర గ్రామాలకు వెళ్లే గిరిజనులు, రోజువారీ విధుల్లో బాగంగా ఆయా గ్రామాలకు వెళ్లే ప్రభుత్వ ఉద్యోగులు ఈ మార్గం గుండా వెళ్లేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పెట్రోల్‌బంక్ సెంటర్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం మీదుగా దోశిళ్లపల్లి వరకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రోడ్డు నిర్మించిన అధికారులు ఆ సందర్భంలో అవే నిధులతో బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభించి సాయిబాబా మందిరం రోడ్డు వరకు నిర్మించినట్లయితే ఈ రోడ్డు బాగుపడి ఉండేదని అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం మూలంగా ఈ రోడ్డుకు అ దుస్థితి పట్టిందని పలువురు ఆరోపిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోకుండా దుర్భరంగా తయారైన ఈ రోడ్డు మరమ్మతులపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, ప్రజల కష్టాలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

మరమ్మతులు చేయడం లేదు



బస్టాండ్ నుంచి జూనియర్ కళాశాల వరకు ఉన్న ప్రధాన రహదారికి సుమారు 20 యేళ్ల నుంచి ఎటువంటి మరమ్మతులూ చేయలేదు. రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నడవడం కూడా కష్టంగా ఉంది. విద్యార్థులు, అధ్యాపకులు, ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ అవసరాల కోసం వచ్చే ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడతున్నారు. ఈ రోడ్డుకు తక్షణమే మరమత్తులు చేయించాలి.

– ఎం.రాజు, చర్ల

ఆర్అండ్‌బీ శాఖకు బదిలీ చేయాలి



చర్ల బస్టాండ్ సెంటర్ నుంచి జూనియర్ కళాశాలకు వెళ్లే రహదారిని జిల్లా పరిషత్ నుంచి ఆర్అండ్‌బీ శాఖకు బదలాయించి ఆర్అండ్‌శాఖ ద్వారా మరమత్తులు చేయించాలి. మండలంలోని అన్ని ప్రధాన రహదార్లను ఆర్అండ్‌బీ శాఖకు బదాలాయించినప్పటికీ ఈ రోడ్డును మాత్రం జిల్లా పరిషత్‌పరిదిలోనే కొనసాగిస్తున్నారు. వెంటనే బదలాయించి రోడ్డును బాగు చేయాలి.

– గడ్డం రాజు, చర్ల

82 శాతం బొగ్గు ఉత్పత్తి


మాట్లాడుతున్న జీఎం రామచందర్

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జనవరి మాసానికి నిర్దేశించిన లక్ష్యానికి గానూ.. 82 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. బుధవారం ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల కార్యక్రమంలో ఆయన ఉత్పత్తి, ఉత్పాదకతల వివరాలను వివరించారు. జనవరి నెలకు ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 11లక్షల 18వేల100టన్నులకు గాను 9లక్షల 13వేల 577 టన్నులతో 82 శాతం ఉత్పత్తిని సాధించామన్నారు. అలాగే ఓబీ వెలికితీత లక్ష్యం 15లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 15.64లక్షల క్యూబిక్ మీటర్లతో 105శాతం నమోదైనట్లు తెలిపారు.జనవరిలో మొత్తంగా 9లక్షల 14వేల 654 టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతల లక్ష్య సాధనకు ఉద్యోగులు, అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏరియా ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఇంజనీర్ నర్సిరెడ్డి, ఏరియా రక్షణ అధికారి వెంకటరమణ, డీజీఎం ఐఈడీ వెంకట్రావు, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, డీవైసీఎంఓ మేరికుమారి, డీజీఎం(ఫినాన్స్) అనురాధ, పర్యావరణ అధికారి శ్రీనివాస్, సీనియర్ పిఓ సింగు శ్రీనివాస్, సీనియర్ సెక్యూరిటి అధికారి షబ్బీరుద్దీన్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి బాబుల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు చేతిపంపులే దిక్కు

అశ్వాపురం: మండలంలో మారుమూల గిరిజన గ్రామ పంచాయతీ అయిన మనుబోతులగూడెం గ్రామ పంచాయతీలోని పాడియం నాగేశ్వరరావు గుంపులో వలస ఆదివాసీ గిరిజనులకు రెండు చేతిపంపులే తాగునీటికి దిక్కు. చేతిపంపులో నీరు అడుగంటితే గిరిజనులకు తాగునీరు దొరకదు. చెలిమనీరే తాగునీరుగా వాడుకుంటారు. ఈ గుంపులో 23 వలస ఆదివాసీ కుటుంబాలు నివాసం ఉంటున్నారు. గ్రామం ఎత్తైన ప్రదేశంలో రాళ్ల గుట్టలు ఉండటంతో మిషన్‌భగీరథ పైపులైన్, పంచాయతీ పైప్‌లైన్ వేయలేదు. వేసవికాలం వస్తుండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదివాసీలు కోరుతున్నారు.

వార్షికోత్సవం..

బూర్గంపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.చిన్నా మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ కీలకమైందన్నారు. ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే జీవితంలో నిలదొక్కుకున్నట్లేనన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు ప్రిన్సిపాల్‌ను ఘనంగా సన్మానించారు.

విచ్చలవిడిగా సారా విక్రయాలు

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం గ్రామంలో విచ్చలవిడిగా నాటుసార విక్రయాలు సాగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. నాటుసార విక్రయాలపై ఎక్సైజ్‌శాఖ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. చివరికి సీతారాంపురం పాఠశాల ప్రాంగణంలో సైతం నాటుసార విక్రయాలు సాగుతున్నాయని, తక్షణమే ఎక్సైజ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బోల్లోజు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ములకలపల్లి: అనారోగ్యంతో మృతిచెందిన జగన్నాథపురం చెందిన బైక్ మెకానిక్ రవీంద్రాచారి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు బుధవారం పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, ఎంపీటీసీ సున్నం సునిత, సీతాయిగూడెం సర్పంచ్ కారం సుధీర్ తదితరులు చారి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేసి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఈ నెల 16న జాతీయ సమ్మె


జీఎంకు సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

దుమ్ముగూడెం: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి తెలిపారు. బుధవారం మండల సమ్మె సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనంగా రూ.26 వేలు స్కీం వర్కర్లకు అందించడం వంటి పలు డిమాండ్లతో సమ్మె నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సీఐటీయూ మండల నాయకురాలు కమలాదేవి, నాయకులు రమణ, కెల్లా ప్రకాష్, చింటు, దారపు సతీష్, అనంతరావు, సమ్మక్క, లక్ష్మి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం వారు ఏరియా జీఎం దుర్గం రామచందర్‌ను కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆర్.లక్ష్మీ నారాయణ, ఏ.సురేందర్, జి.శ్రీనివాస్, వెలగపల్లి జాన్, పి.రవి, మంగీలాల్, సీతారాములు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అడవిని రక్షించాలి

దుమ్ముగూడెం: అటవీ సంపదను అటవీశాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ పరిరక్షించాలని భద్రాచలం ఎఫ్‌డీఓ కె.మోహన్‌రావు సిబ్బందికి సూచించారు. బుధవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మండలంలోని మానుగట్ట, జిన్నెలగూడెం, అంజుబాక ప్లాంట్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అటవీ సంపదను రక్షించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని, నిత్యం నిఘా ఏర్పాటు చేసి అటవీ సంపద తరలిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట రేంజర్ కనకమ్మ, డీఆర్వో శోభన్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

కొత్తపల్లిలో వైద్య శిబిరం

చర్లరూరల్: చర్ల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షల అనంతరం డాక్టర్ శ్రీధర్ ఇంటింటికి వెళ్లి ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. దోమలు పుట్టకుండా.. కుట్టకుండా చూసుకోవాలని సూచించారు. జ్వరాలు వచ్చినట్లయితే వెంటనే ఆశా కార్యకర్తలను, సిస్టర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంప్రసాద్, గోపి, శిరీష, సమ్మక్క, లలిత పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు, థియరీ ఎగ్జామ్స్‌పై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాలేజి ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాబోవు పరీక్షలకు ఒక ప్రణాళిక ప్రకారం అన్ని సబ్జెక్టుల్లో సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లెల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


వైద్యసేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వైద్యులకు, సిబ్బందికి సూచించారు. బుధవారం మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్, డెంటల్, బ్లడ్ బ్యాంక్ సేవా కేంద్రాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిలో కల్పిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును వైద్యులు, సిబ్బంది శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులను పలకరించి అందుతున్న వైద్య సేవలు, వసతుల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడిజిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, సర్పంచ్ బచ్చల భారతి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, వైద్యులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కంటి పరీక్షలు ప్రారంభం..

మండలంలోని మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కంప్యూటర్‌తో కంటి వైద్యపరీక్షల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో కంప్యూటర్‌తో వైద్యపరీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని విజన్ సెంటర్‌లో ప్రతీ సోమ, బుధ, శుక్రవారాల్లో కంటి చూపు సమస్యలతో బాధపడే వారు కంప్యూటర్‌తో కంటివైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. ఆయన వెంట డాక్టర్ జి.సంజీవరావు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ, తన గెలుపుకు సహకరించిన టీడీపీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టబోయే చర్యలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, దొడ్డి కృష్ణ, సర్పంచ్ బచ్చల భారతి, ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలు ప్రారంభం


సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

దుమ్ముగూడెం: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. తూరుబాక పంచాయతీలోని రామకృష్ణాపురం గ్రామంలో రూ.5లక్షలు, బి.కొత్తగూడెం పంచాయతీలో బండారుగూడెం గ్రామంలో రూ.5లక్షలు, సింగవరం పంచాయతీలో వైట్‌నాగరారం గ్రామంలో రూ.4 లక్షల సీడీపీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నే సత్యనారాయణమూర్తి, కణితి రాముడు, స్థానికసర్పంచ్‌లు భూక్యా చందు, కాటిబోయిన వెంకటేశ్వర్లు, సోడే కొండయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బొల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యంగా పని చేయాలి


నూతన కమిటీ సభ్యులతో వాసవీ క్లబ్ నాయకులు, సభ్యులు

గుండాల: వాసవీ క్లబ్ సభ్యులు సమాజ సేవే లక్ష్యంగా పనిచేయాలని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ పాలిశెట్టి శివకుమార్ సూచించారు. మండల కేంద్రంలో బుధవారం వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాసవీక్లబ్ సేవా కార్యక్రమాలతో పాటు అనేక పథకాలు ఏర్పాటు చేసి నిరుపేద ఆర్యవైశ్యులకు అండగా నిలిస్తోందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నూతన క్లబ్‌లు ఏర్పాటు కావడం, సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మానాల వెంకటేశ్వర్లు, పుల్లకాండ ఉపేందర్, కోశాధికారి అనుమోలు వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారిని పూలమాలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్, కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్, కోశాధికారి చింతల వినోద్‌కుమార్, జిల్లా పెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాళ్ల సోమసుందర్, వెంకట రోషయ్య, ఉపేంద్రనాథ్ గుప్తా, దామోదర్, రాచర్ల వెంకటేశ్వర్లు, రామిడి శంకర్, తాటిపల్లి సుబ్బారావు, నాగమళ్ల జయశంకర్, గుమ్మడి వెల్లి శ్రీనివాస్, చిచిరాల లింగయ్య, దోసపాటి వెంకటేశ్వర్లు, గోళ్ల రాదాక్రిష్ణ మూర్తి, మాశెట్టి వరప్రసాద్, దారా నర్సింహరావు, పురుషోత్తం, వ్యామసాని జనార్దన్, ఇల్లందు వాసవి క్లబ్ అధ్యక్షుడు పుల్లూరి సతీష్, ఝెలుగూరి ముధుబాబు, సోఫా రాజశేఖర్, గౌరిశెట్టి నాగభూషనం, శ్రీనివాస్, అర్వపల్లి రాధాకృష్ణ, మానాల నారాయణ మూర్తి, ప్రభాకర్, వీరన్న, గౌరిశెట్టి సత్యనారాయణ, ప్రభాకర్, మానాల ప్రణీత్, టి.నాగరాజు, వైద్యాధికారి మనీష్‌రెడ్డి పాల్గొన్నారు.

జంతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

అశ్వారావుపేటరూరల్: జంతు సంక్షేమానికి ప్రతి పౌరుడూ ప్రాధ్యాన్యత ఇవ్వాలని అశ్వారావుపేట ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం అశ్వారావుపేట, నారాయణపురం, వినాయకపురం, కొత్త మామిళ్లవారిగూడెం, గుమ్మడవల్లి, నందిపాడు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో జంతు సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా విద్యార్థులకు 'జంతు సంరక్షణ'అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందించారు. ఆయన మాట్లాడుతూ.. అడవులు, సరస్సులు, నదులు, వన్యప్రాణులతోపాటు పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పశు వైద్యురాలు స్వప్న, లయన్స్‌క్లబ్ బాధ్యులు యూఎస్ ప్రకాశ్ రావు, కొఠారు చలపతిరావు, యూ సుబ్రహ్మణ్యం, దూపకుంట్ల దుర్గారావు, పశు వైద్యశాఖ సిబ్బంది బాబ్జీ, కుమారి, అశోక్, నాగేంద్ర పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు ఘన సన్మానం


గుండాల: సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు


అశ్వాపురం: సర్పంచ్ శారద దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గుండాల: ఆళ్లపల్లి మండలంలో పనిచేసిన సర్పంచ్‌లకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మంజు భార్గవి, జెడ్పీటీసీ కొమరం హన్మంతు, ఎంపీడీఓ రామారావులు పాల్గొని మాట్లాడుతూ.. ఈ ఐదేళ్ల కాలంలో గ్రామాల అభివృద్ధికి చాలా కృషి చేశారని గుర్తు చేశారు. అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు శాలువాలతో సన్మానించి, సీతారాముల విగ్రహాల షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, డీటీ అనూష, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో..

దుమ్ముగూడెం: మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ రేసు లక్ష్మి అధ్యక్షతన బుధవారం సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పాల్గొని 37 మంది సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీడీఓ ముత్యాలరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి..

చర్లరూరల్: చర్ల మేజర్ గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని చర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణ, సిబ్బంది బుధవారం సన్మానించారు. సర్పంచ్ కాపుల కృష్ణ, ఉప సర్పంచ్ శిరిపురపు శివతోపాటు వార్డు సభ్యులు ముత్యాల శివప్రసాద్, దొడ్డి హరినాగ వర్మ, నీలం వెంకటరమణ, పూజారి కొండ, సింగ సంతోష్, కట్టం కన్నారావు, సత్తిబాబు, కూర సుజాత, కవ్వాల రజిత, దొడ్డి కల్పన, ఎడ్ల సీత, చిరునోముల బిందు మాధవి, పోలూరి సుజాత, చంద్రావతిల ఐదేళ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా వారిని సన్మానించారు.

అశ్వాపురం: గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ముత్తినేని సుజాత అధ్యక్షతన సర్పంచ్ శారద, ఉపసర్పంచ్ చందూలాల్, పాలకవర్గ సభ్యులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌ను, పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించారు. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు భావోద్వేగంతో ప్రజాసేవలో తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శారద మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అహర్నిశలు కృషి చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య, వైద్యాధికారి సంకీర్తన, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.ఖదీర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వేదాంతపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంగీతం వీర్రాజు ఆధ్వర్యంలో సర్పంచ్ సోని శివశంకర ప్రసాద్, ఉప సర్పంచ్ కాశీ కాళాహస్తీ, వార్డు మెంబర్లను బుధవారం శాలువా కప్పి, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..ఐదేళ్ల పాటు గ్రామ పంచాయతీను అన్నీ రంగాల్లో అభివృద్ధి చేయడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యాఖుబ్ అలీ, గ్రామపెద్దలు వెంకటస్వామి, గడ్డం వెంకటేశ్వర్లు, పొట్టి రామారావు, సింహాచలం, గ్రామస్తులు పాల్గొన్నారు.